# మినీకథలు

## లాభం

కాశీభట్ల భానుమూర్తి



అది ఒక ప్రయివేట్ ఫ్యాక్టరీ. సుమారు వెయ్యిమంది వర్కర్సుతో మంచి లాభంతో నడుస్తోంది ఆ ఫ్యాక్టరీ. నెల నెలా సక్రమంగా జీతాలు చెల్లించటమేకాక బోనస్‌లు. ఏడాదికొకసారి ఇంక్రిమెంట్లు కూడా ఇస్తున్నారు ఫ్యాక్టరీ యాజమాన్యం వారు వర్కర్సు కూడా ఆ ఫ్యాక్టరీలో పని చేస్తున్నందుకు చాలాగర్వంగా.సంతోషంగా ఉండేవారు.

సుబ్బారావు ఆ ఫ్యాక్టరీ వెయ్యిమందిలో ఒకడు. కాకపోతే అతను క్లర్కు. సుబ్బారావుకి నిన్నటి నుంచీ మనస్సు మనస్సులో లేదు. నిన్న ఎవరెవరికి ఎంత ఎంత ఇంక్రిమెంటు పడిందీ తెలిసింది. సుబ్బారావుతో సమానంగా జాయినయ్యి. సుబ్బారావు చేసే పనే చేసే శశికాంత్‌కి సుబ్బారావుకన్నా ఐదు రూపాయలు ఇంక్రిమెంటు ఎక్కువ పడింది. సుబ్బారావుకి ఈ చర్య చాలా అమానుషంగా అనిపించింది.

అదీకాక తోటివర్కర్సు సుబ్బారావుతో "ఏమిటి మీకన్నా ఆ శశికాంత్‌గారికి ఎక్కువ ఇంక్రిమెంటు వేశారట. మీకు తెలుసా?" అనేవారు.

సుబ్బారావు మనసు కుతకుత ఉడికింది. లాభంలేదు. ఏదో ఒకటి చేసి శశికాంత్‌కన్నా ఎక్కువ ఇంక్రిమెంట్ సంపాదించుకోవాలని నిశ్చయించుకొన్నాడు. సుబ్బారావు ఆ విషయంమీద ఆలోచించగా. ఆలోచించగా ఒక మంచి ఉపాయం తట్టింది.

తన తెలివికి తననే అభినందించుకొని వెంటనే రిజైన్ లెటర్ వ్రాసేశాడు సుబ్బారావు. 'ఈ రిజైన్ లెటర్ తీసుకొని వెళ్ళి మేనేజర్‌గారికి ఇస్తే ఆయన తప్పకుండా నన్ను ఉండమంటారు. ఎందుకంటే నాలా అనుభవం ఉండి అన్నీ తెలిసిన పనివాడు వారికి దొరకడు. ఇనుము కాలినప్పుడే సమ్మెట దెబ్బ వేయాలి. వారు ఉండమని బలవంతం పెట్టినప్పుడు జీతం కనీసం యాభై రూపాయలు పెంచి. ఇల్లు ఇమ్మని అడగాలి లేదా ఇంటిరెంట్ అన్నా 'పే' చేయమనాలి. అప్పుడు శశికాంత్‌కన్నా నేనే అధికం అవుతాను' అని మనసులో తలచాడు సుబ్బారావు.

అనుకొన్నట్టుగానే ఆ లెటర్ మేనేజరుగారికి ఇచ్చాడు సుబ్బారావు. అది పూర్తిగా చదివి సంతకం పెట్టాడు మానేజర్ ప్రసాదరావు. ఆ తరువాత ఆ లెటర్ తీసుకొని మేనేజింగ్ డైరెక్టర్‌గారి గదికి బయలుదేరాయనే స్వయంగా.

సుబ్బారావు గుండెల్లో రాయిపడింది. 'అనుకున్నది ఒకటి-అయింది ఒకటి' ఉండి పొమ్మని ప్రెస్ చేస్తారు. అప్పుడు నా కోరికలను వారికి. వారి మనస్సుకి 'ప్రెస్' చేయచ్చు అనుకున్నాడు తను. కాని వారు ఉండిపొమ్మని 'ప్రెస్' చేయలేదు సరికదా వెళ్ళిపొమ్మని 'ప్రెస్' చేసేటట్టు ఉన్నారు...' ఇలా అనుకోగానే సుబ్బారావు ఇంక ఆగలేకపోయాడు. వెంటనే మేనేజింగ్ డైరెక్టర్‌గారి రూముకి పరిగెత్తాడు సుబ్బారావు. పొరపాటున వ్రాశానని. ఇంకెప్పుడూ అలా వ్రాయనని. క్షమించమని మేనేజింగ్ డైరెక్టర్‌గారిని వేడుకొన్నాడు. సుబ్బారావు వింత ప్రవర్తనకి ఆశ్చర్యపడి లెటర్ తిరిగి ఇచ్చేశాడు మేనేజింగ్ డైరెక్టర్ నరసింహారావు.

'నయమే బ్రతికాను! ఎక్కడా ఉద్యోగం రాకుండానే రిజైన్ ఇచ్చేశాను. వీళ్ళు తీసేస్తే పెళ్ళాం బిడ్డలతో పస్తులుండాల్సి వచ్చును. పోనీలే శశికాంత్‌కన్నా ఐదు రూపాయలు తక్కువయినా మునిగిపోయిందిలేదు' ఇలా మనస్సులో తలుచుకొంటూ బయటికివచ్చిన సుబ్బారావుకి కిటికీలోంచి మానేజరుగారి మాటలు వినపడి అది తనని గురించే అని నిశ్చయించుకొని ఆగి ఆతృతగా వినసాగాడు

"నేను చెప్పానుగదా సార్. ఇలా రిజైన్ ఇస్తారు. వాళ్ళు లేకపోతే మనకి అనుభవం ఉన్నవాళ్ళు దొరకరని. మనం తప్పక వాళ్ళనే బ్రతిమిలాడి జీతం పెంచేసి వాళ్ళ కోరికలన్నీ కూడా తీర్చాక మళ్ళీ మన ఫ్యాక్టరీలోనే చేస్తామని ఒప్పుకొంటారు. సుబ్బారావు కూడా ఇదే ఎత్తు వేశాడు. శశికాంత్‌కన్నా అతనికి వర్కు తక్కువగదా అని ఐదు రూపాయలు తగ్గిస్తే రిజైన్ ఇచ్చాడు సుబ్బారావు. దానిమీద నేను సంతకంపెట్టి మీ దగ్గరికి తీసుకొని వచ్చాక ఇక ఆగలేక పరిగెత్తుకు వచ్చాడు తనే" అని మానేజింగ్ డైరెక్టర్ నరసింహారావుకి వివరించాడు మేనేజర్ ప్రసాదరావు.

ఇది బయటి నుంచి విన్న సుబ్బారావు మనస్సు కుతకుతా ఉడికిపోయింది 'ఓరి నీ! వీళ్ళు లాభం కోసం నా లాభాన్నే నాశనం చేశారే' అని మనస్సులో తిట్టుకొని వేడివేడి కాఫీ కోసం కేంటీన్‌వైపు బయలుదేరాడు సుబ్బారావు.